క్లుప్తంగా

మురుగునీరు తొలిగించాలి



పోణంగి రోడ్డులో మురుగునీరు ప్రవహించేలా కచ్చా కాలువ ఏర్పాటు చేస్తున్న స్థానికుడు

ఏలూరు రూరల్: ఏలూరు నగర కార్పొరేషన్ పరిధి 13 డివిజన్‌లో రోడ్డుపై చేరిన మురుగునీరు తొలిగించాలని జమాతే ఇస్లామి హింద్ కార్యకర్త మొహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్ కోరారు. పోణంగి రోడ్డుకు ఇరుపక్కల మురుగునీరు నిలిచిపోతోందన్నారు.ఫలితంగా రోడ్డు చిత్తడిగా మారడంతో పాదచారులతో పాటు వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కార్పొరేషన్ అధికారులు స్పందించిన పోణంగి రోడ్డు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పరిసరాల శుభ్రత చేపట్టాలని కోరారు. వర్షాకాలం కావడంతో ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆయన మురుగునీరు ప్రవహించేందుకు మార్గం ఏర్పాటు చేశారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తం



ఏలూరు టైటస్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు, సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అతిసార వ్యాధి నిరోధానికి చర్యలు చేపట్టామని, ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని ఏలూరు తాపీమేస్త్రీ కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బీ.సాయిలిఖిత తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక టైటస్ నగర్ ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితమవుతుందని దీంతో డయేరియా, కామెర్లు, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, భోజనానికి ముందు చేతులు, కాళ్లు పరిశుభ్రపరచుకోవాలని కోరారు. ఎవరికైనా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఉండే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని లేదా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తను సంప్రదించాలని చెప్పారు. స్థానిక నాయకులు బెజ్జం అచ్చాయమ్మ మాట్లాడుతూ వ్యాధులబారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ కే.నిర్మల, మలేరియా హెల్త్ అసిస్టెంట్లు మేక శ్రీనివాసరావు, సీహెచ్ రమేష్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జనావాసాల మధ్య చిట్టడవులు

- నగరంలోని ఖాళీ స్థలాలతో తంటా
- దోమలు విజృంభించేలా మురుగు నీరు
- పట్టించుకోని నగరపాలక అధికారులు



ఏలూరు శాంతినగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో భారీగా పెరిగిన మొక్కలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవటంతో దోమలు పెరిగిపోతూ ప్రజల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. నగరంలో ఖాళీ స్థలాల యజమానుల నిర్లక్ష్యం కారణంగా జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు చిట్టడడవులను తలపిస్తూ భారీగా చెట్లు, పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి విష సర్పాలు, కీటకాలకు ఆవాసంగా మారాయి. ఈ ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందులు గుంపులుగా వచ్చి ఇక్కడి బురదలో దొర్లడంతో ఆయా ప్రాంతాలు అపరిశుభ్రత నెలకొంటోంది. గతంలో ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసినా వారు స్పందించడం లేదు. ఖాళీ స్థలాలను వాటి యజమానులు సక్రమంగా నిర్వహించుకునేలా అధికారులు చర్యలు చేపట్టినా ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి మరింత దిగజారింది. ప్రస్తుతం అధికారులు వీటిపై దృష్టి సారించకపోవటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీ స్థలాలతో తంటా

ఏలూరు నగరంలో పలు ప్రాంతాల్లో గతంలో వెంచర్లు వేయగా, చాలా మంది స్థలాలను కొనుగోలు చేశారు. కొందరు ఇళ్లు నిర్మించుకోగా, చాలా వరకు స్థలాలు ఖాళీగా ఉండిపోయాయి. ఈ ఖాళీ స్థలాలతో ప్రస్తుత వర్షాకాలంలో స్థానికులకు ఇబ్బందులు తప్పటంలేదు. ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉండడం, వాటిలో వర్షపు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతూ, పందులకు ఆవాసాలుగా, దోమల వృద్ధికి దోహదపడేలా అపరిశుభ్రంగా ఉంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏలూరు మోతేవారితోటలో దోమలు, కీటకాలకు ఆవాసంగా ఖాళీ స్థలం



ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతంలో ఖాళీ స్థలంలో భారీగా పెరిగిన పొదలు

అధికారులు చర్యలు చేపట్టాలి

నగరంలోని అశోక్‌నగర్, మోతేవారితోట, బీడీ కాలనీ, శాంతినగర్, విద్యానగర్, మరడాని రంగారావు కాలనీ, సపోటాతోట, మారుతీనగర్ ఇలా అనేక ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇళ్ల మధ్యలో అడవుల్లా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగిపోతూ రాత్రివేళల్లో అటు వైపు వెళ్లాలంటే ఇబ్బందిపడేలా ఉందని స్థానికులు అంటున్నారు. గతంలో నోటీసులు జారీ చేయటంతోపాటు ఆయా ప్రాంతాల్లో కార్పొరేషన్ అధికారులే చెట్లను తొలగించి వాటి ఖర్చును ఖాళీ స్థలాల యజమానుల నుంచి వసూలు చేసేలా చర్యలు చేపట్టారని చెబుతున్నారు.

స్థల యజమానులదే బాధ్యత



ఏలూరు నగరంలో ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను బాగుచేసుకోవాల్సిన బాధ్యత ఉంది. నగరంలోని అన్నిటినీ బాగు చేయాలంటే కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడుతుంది. ఎక్కడైనా ఫిర్యాదులు అందితే వాటి యజమానులతో మాట్లాడి వాటిని శుభ్రం చేసేలా చర్యలు చేపడుతున్నాం. కొన్ని చోట్ల మురుగు నీరు, వర్షపు నీరు ఉంటే ఆయా ప్రాంతాల్లో దోమలు విజృంభించకుండా ఆయిల్ బాల్స్ వేయటంతోపాటు, దోమలు పెరగకుండా మందును పిచికారీ చేయిస్తున్నాం. పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు అవకాశం లేదు.

– సంక్రాంతి వెంకటకృష్ణ, నగర కమిషనర్, ఏలూరు

ఏపీ పీటీడీ జై భీమ్ అసోసియేషన్‌కు నూతన కమిటీ



పీటీడీ జిల్లా అధికారి వరప్రసాద్‌ను కలిసిన పీటీడీ జై భీమ్ అసోసియేషన్ కమిటీ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ జైభీమ్ అసోసియేషన్ నూతన కమిటీలు ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా తగరం రమేష్, కార్యదర్శిగా కొత్తపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పామర్తి సతీష్, జిల్లా కోశాధికారిగా ఎస్. సువాద్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. ఏలూరు డిపో శాఖకు అధ్యక్షుడిగా ఎండీ ఖాసిమ్, డిపో కార్యదర్శిగా కొత్తపల్లి బాబూరావు, కోశాధికారిగా బి.విల్సన్ రావు, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. రాంబాబు, డిపో కార్యవర్గ సభ్యుడిగా డీవీ రావును ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీలు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి నూతన కమిటీలను పరిచయం చేసుకున్నారు. ఆయా కమిటీలను గుర్తించి ఇకపై నిర్వహించనున్న అన్ని కార్యక్రమాల్లో తమ అసోసియేషన్ ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

రోడ్డు, డ్రెయినేజీ త్వరితగతిన నిర్మించాలి

- అధికారులకు ఆదేశాలు జారీ చేశాం
- ఏలూరు కోఆప్షన్ సభ్యుడు పెదబాబు



మారుతీనగర్, మసీదు రోడ్డులో మురుగునీటి పరిస్థితిని పరిశీలిస్తున్న కోఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ వెంకటకృష్ణ తదితరులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలోని మారుతీనగర్, మసీదు రోడ్డులో 15 రోజుల్లోనే రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. ఏలూరు 4వ డివిజన్ మసీదు రోడ్డులో వర్షాకాలంలో రోడ్డు వర్షపునీటితో మునిగిపోతుందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేయగా, రెండు రోజుల క్రితం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఆయన మసీదు రోడ్డు పరిస్థితిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే ఆదేశాలతో బుధవారం ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కోఆప్షన్ సభ్యులు పెదబాబు మసీదు రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికంగా ప్రజలతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం చేయటంతోపాటు ఒకవైపు డ్రెయినేజీ నిర్మిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపై ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రయ్య, ఎంఈ కొండలరావు, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతీ, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక నాయకులు ఉన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతోపాటు అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉండడంతో స్టాప్ డయేరియా పేరుతో చేపట్టే ప్రచార కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళి అప్రమత్తం చేయాలని ఏలూరు నగర కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన స్టాప్ డయేరియా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యాధులు విజృంభించకుండా పటిష్టమైన ముందుస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అతిసార వ్యాధి నిరోధానికి ప్రజలు శుభ్రమైన, సురక్షితమైన కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, భోజనం చేసే ముందు సబ్బుతో చేతులను పరిశుభ్రం చేసుకోవాలని కోరారు. జూలై 1 తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా ప్రచారాన్ని ప్రజల్లోకి తీసువెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాస్, పాము శామ్యూల్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, ప్రజారోగ్య విభాగ సూపరింటిండెంట్ ఎండీ సిరాజుద్దీన్, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై 14న సదస్సు

ఏలూరు (టూటౌన్): పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈనెల 14న విజయవాడలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి పిలుపు నిచ్చారు. ఈ మేరకు పవరుపేటలో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వాసితుల పునరావాసం కోసం ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుపై శ్రద్ధ చూపి పనిచేయడం చాలా సంతోషకరమన్నారు. పోలవరానికి భూములు ఇచ్చి సర్వస్వాన్ని కోల్పోయిన నిర్వాసితుల గురించి పట్టించుకోకపోవడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జల వనరుల శాఖ మంత్రి పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేత పత్రం సందర్భంగా సమీక్ష సమావేశాల్లో, కొత్త మంత్రివర్గ క్యాబినెట్ మీటింగ్ సందర్భంగా గాని పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై చర్చించారే తప్ప జల సమాధి అవుతున్న పోలవరం నిర్వాసితులకు జరిగిన నష్టంపై మాట్లాడకపోవడం బాధాకరమని ఆయన తెలిపారు. ముందుగా నిర్వాసితులు సమస్యపై ఆ తర్వాత ప్రాజెక్టుపై దృష్టి సారించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అంతర్జాతీయ, జాతీయ నిబంధనలకు అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ విషయాలను రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలిపేందుకు ఈ నెల 14న ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బీవీ రాఘవులు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడతారన్నారు. ఏలూరు జిల్లాలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితులకు పునరావాసం కల్పించారని అన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం టౌను, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఉన్న పోలవరం నిర్వాసితులంతా ఈ సదస్సుకు తప్పక హాజరు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి విజ్ఞప్తి చేశారు.



సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

జీతాల బకాయిలు విడుదల చేయాలి



సమగ్రశిక్ష కార్యాలయం వద్ద ప్లకార్డులతో ఆందోళన నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్ష ప్రాజెక్టులో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని, ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంల వద్ద ఫెడరేషన్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా శాఖల ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కె.వినోద్ కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే బావాజీ మాట్లాడుతూ ప్రతి నెలా సమయానికి వేతనాలు రాక ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రతి నెలా వేతనాలు వచ్చేలా ముందస్తు బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె కాలపు వేతనాలు, సమ్మెలో జరిగిన ఒప్పందాల మేరకు వెంటనే సమ్మెకాలం జీతం విడుదల చేసి, హెచ్‌ఆర్ పాలసీ అమలుకు కమిటీ ఏర్పాటు చేసి ఒప్పందాల అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాలకు సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం మినిమం టైం స్కేల్ అమలుకు చర్యలు తీసుకోవాలని, త్వరలో విడుదల కానున్న ఉపాధ్యాయ డీఎస్సీలో అర్హత కలిగిన ఉద్యోగులకు వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని, ఉమ్మడి ఎన్నికల హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు బి.రాజ్యలక్ష్మి, కె.సోమరాజు, కె. మణికంఠ రాజు, టి.ఆనంద్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	46	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 12
బెండకాయలు	34	కంద	60
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	38
కాకర కాయలు	50-56	కీరా దోస	44
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	94
బీరకాయలు (పందిరి)	34	అల్లం	180
క్యాబేజీ	44	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34-50	పాలకూర	15
దొండకాయలు	34	చుక్కకూర	15
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	52	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణీ	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	96
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

కార్పొరేషన్‌కు ఆరు ఫాగింగ్ యంత్రాలు



ఫాగింగ్ యంత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగర ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ సీజనల్ వ్యాధులకు కారణమైన దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. ఏలూరు కార్పొరేషన్ కొత్తగా కొనుగోలు చేసిన ఆరు హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలను, స్ప్రేయింగ్ మెషిన్లను ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణతో కలిసి పరిశీలించి మలేరియా విభాగానికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరపాలక సంస్థకు గతంలో రెండు హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు, ఒక వెహికల్ ఫాగింగ్ మిషన్ ఉండేదనీ, ప్రస్తుతం ఏలూరు కార్పొరేషన్‌లో ఏడు పంచాయతీలు విలీనం కావడంతో విస్తీర్ణం పెరగడంతో ఫాగింగ్ యంత్రాల కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం టైమ్‌టేబుల్ ఏర్పాటు చేసుకుని వారానికి ఒకసారి ప్రతి డివిజన్‌లోనూ రెండు పూటలా దోమల నివారణ చర్యలు చేపడతామన్నారు. ప్రతి డివిజన్‌లో సుమారు మూడు గంటల పాటు ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేసేలా ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దోమ కాటుతో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని స్పష్టం చేశారు. నగరంలోని ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో చెత్తను, నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతీ, ఎంఈ కొండలరావు, కార్పొరేటర్లు బత్తిన విజయకుమార్, వందనాల దుర్గాభవానీ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రజలంతా శాంతియుతంగా జీవించాలి

దెందులూరు: ప్రతి ఒక్కరూ సోదరభావంతో శాంతియుతంగా జీవించాలని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. బుధవారం సోమవరప్పాడులో పోలీస్ పికెటింగ్‌ను ఆయన పరిశీలించారు. పోలీస్ పికెటింగ్ వద్ద ఉన్న స్థానికులతో డీఎస్పీ మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించినా, గొడవలు, అల్లర్లకు పాల్పడినా ప్రోత్సహించినా అటువంటి వారిపై కొత్తగా వచ్చిన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్, దెందులూరు ఎస్సై కే.స్వామి, పెదపాడు ఎస్సై శుభాకర్ పాల్గొన్నారు.

పట్టించుకోరా?



ఫ్లై ఓవర్ ఎడమవైపున కూలిపోయిన రక్షణ గోడ

ఏలూరు నగరానికి ప్రధానమైన ఫ్లై ఓవర్ మీదుగా ఎన్నో వేల వాహనాలు నిత్య రాకపోకలు సాగిస్తుంటాయి. ఫ్లై ఓవర్ ఎడమ వైపు రక్షణ గోడ కూలిపోయి కొన్ని నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. అది కూడా వాహనాలు దిగేవైపు పడిపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనదారులు అదుపు తప్పితే ప్రాణనష్టం కలుగుతుందని తెలిసినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఫోటో: సాక్షిఫోటోగ్రాఫర్/ ఏలూరు

మథర్ థెరిస్సా హోమ్‌కు వృద్ధురాలు



వృద్ధురాలిని హోమ్‌కు అప్పగిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ ఏవో నిర్మల

ఏలూరు టౌన్: పెదపాడు మహేశ్వరపురంలో నిరాదరణకు గురైన వృద్ధురాలు సమాచారాన్ని స్థానికులు వన్‌స్టాప్ సెంటర్‌కు విమెన్ హెల్ప్‌లైన్ 181కు తెలియజేశారు. మహిళా శిశుసంక్షేమ సాధికారిత అధికారి కేవీఎల్ పద్మావతి ఆదేశాల ఆ వృద్ధురాలిని ఏలూరులోని వన్‌స్టాప్ సెంటర్‌కు తీసుకువచ్చామని సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ నిర్మల బుధవారం తెలిపారు. వృద్ధురాలు కృష్ణకుమారి (60)ను ఏలూరు వన్‌స్టాప్ సెంటర్‌కు తీసుకువచ్చారు. ఆమెను తాత్కాలిక వసతి నిమిత్తం ఏలూరు వంగాయగూడెంలోని మథర్‌థెరిస్సా హోమ్‌లో ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు. ఎవరైనా వృద్ధురాలి బంధువులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. వేదకుమారి, కేస్ వర్కర్ త్రివేణి, మహిళా కార్యదర్శి వైదేహి ఉన్నారు.

రోజుకు రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భీమడోలులోని 220/132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 100 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 మెగావాట్ల సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయానికి రోజుకు రెండు విడతల్లో విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. ఈ నెల 11 నుంచి నెల రోజులపాటు ఏలూరు, పెదవేగి, ద్వారకా తిరుమల, నారాయణపురం, భీమడోలు ప్రాంతాల్లోని వ్యవసాయ విద్యుత్‌ను రోజుకు రెండు విడతల్లో విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.